## క్లుప్తంగా

### బ్యాంకు ఉద్యోగుల సంక్షేమమే ధ్యేయం



గుడ్లవల్లేరు: బ్యాంకు ఉద్యోగుల సంక్షేమమే తమ సంఘ ధ్యేయమని కెనరా బ్యాంకు ఉద్యోగుల సంఘ రాష్ట్ర కార్యవర్గ సభ్యుడు సీహెచ్.అభయాంజనేయస్వామి అన్నారు. కెనరాబ్యాంకు ఉద్యోగుల రాష్ట్ర స్థాయి సంఘానికి వరుసగా మూడో సారి సభ్యుడిగా ఎన్నికైన అభయాంజనేయస్వామిని సోమవారం అంగలూరు కెనరాబ్యాంకులో మేనేజర్ కె.విజయ్‌కుమార్ చేతుల మీదుగా ఉద్యోగులు సన్మానించారు. ఉద్యోగుల సంక్షేమానికి అభయాంజనేయస్వామి చేస్తున్న కృషిని విజయ్‌కుమార్ కొనియాడారు. కార్యక్రమంలో బ్యాంకు సిబ్బంది, ఖాతాదారులు పాల్గొన్నారు.

### ఎంఈఓ-2గా డేవిడ్‌రాజు



డేవిడ్ రత్నరాజు

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండల విద్యాశాఖాధికారి-2 గా జి డేవిడ్ రత్నరాజు నియమితులయ్యారు. ఆదివారం జరిగిన కౌన్సిలింగ్‌లో ఈయన నియామకాన్ని జిల్లా విద్యాశాఖాధికారి అందజేసినట్లు తెలిపారు. గతంలో నందివాడ జెడ్పీ హైస్కూల్ హెచ్‌ఎంగా పనిచేసిన ఆయన తిరిగి ఇదే మండలానికి ఎంఈఓగా రావడం విశేషం.

### మండవల్లి ఎంఈఓ-2గా రత్న సునాదం



రత్న సునాదం

మండవల్లి: మండల విద్యాశాఖ అధికారి-2గా శీలం రత్నసునాదం సోమవారం బాధ్యతలు స్వీకరించారు. ఈమె గంపలగూడెం మండలం నుంచి ఉద్యోగోన్నతిపై ఇక్కడికి వచ్చారు. రత్న సునాదం బాధ్యతలు చేపట్టడంపై ఉపాధ్యాయ సంఘాలు హర్షం వ్యక్తం చేశాయి.

### ఎంఈవో - 2గా శ్రీలక్ష్మి

మొవ్వ: మండల విద్యాశాఖ అధికారి-2గా కాటూరి శ్రీలక్ష్మి సోమవారం భాధ్యతలు చేపట్టారు. ఎన్టీఆర్ జిల్లా నిడమానూరు జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో ప్రధానోపాధ్యాయురాలుగా విధులు నిర్వరిహిస్తున్న ఆమె ఉద్యోగోన్నతిపై మొవ్వ ఎంఈవో-2గా విచ్చేశారు. డేటా ఎంట్రీ ఆపరేటర్ టీ మురళీకృష్ణ, ఎంఐఎస్ కో ఆర్డినేటర్ గొరిపర్తి శివపార్వతి, సీఆర్పిలు చీలి నాగరాజు, సీహెచ్ నాగ హిమజ, సీహెచ్ శ్రీమన్నారాయణ, పంది కృష్ణార్జునరావు, తాతా సమర్పణరావు, కంచర్ల ఆంజనేయులు ఆమెకు స్వాగతం పలికి అభినందించారు.

### కైకలూరు ఎంఈవో-2గా శ్రీనివాసరావు

కైకలూరు: మండలానికి ఉంగుటూరు మండలం పొట్టిపాడు హెచ్ ఎంగా పనిచేస్తున్న వెలమల శ్రీనివాసరావు ఎంఈవో-2గా బాధ్యతలు సోమవారం చేపట్టారు. నూతన ఎంఈవోను ప్రస్తుత ఎంఈవో డి.రామారావు, పలువురు ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు ఎంఈవో కార్యాలయంలో పుష్ప గుచ్ఛంతో స్వాగతించారు.

### విద్యాభివృద్ధికి కృషి చేస్తాం



ముదినేపల్లి రూరల్: మండలంలో విద్యాభివృద్ధికి కృషి చేస్తానని ఎంఈఓ కే నరేష్‌కుమార్ అన్నారు. నరేష్‌కుమార్ నూతన ఎంఈఓగా సోమవారం బాధ్యతలు చేపట్టగా పలు ఉపాధ్యాయ సంఘాల నేతలు, ఉపాధ్యాయులు కార్యాలయంలో సత్కరించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ గతంలో ఇక్కడ పనిచేసిన అనుభవాన్ని దృష్టిలో పెట్టుకుని విద్యాభివృద్ధికి మరింతగా మెరుగైన ప్రణాళికలు రూపొందించి అమలు చేస్తానన్నారు. ఉపాధ్యాయులతో సోదరభావంతో మెలుగుతూ విధులు నిర్వహిస్తానన్నారు. సంఘాల నేతలు, ఉపాధ్యాయులు సహకరించాలని కోరారు. ఏపీటీఎఫ్ నేతలు బేతాళ రాజేంద్రప్రసాద్, సీహెచ్ నాగమల్లేశ్వరరావు, ఆర్.శ్రీనివాసరావు, పీఆర్టీయూ, ఇతర సంఘాల నేతలు ఎంఈఓను సత్కరించిన వారిలో ఉన్నారు.

### సీపీఎం నాయకుడు కాళిదాసు మృతి



కాళిదాసు(ఫైల్)

గుడివాడ టౌన్: సీపీఎం గుడివాడ డివిజన్ కార్యదర్శి, జిల్లా కమిటీ సభ్యుడు కామ్రేడ్ లంకా కాళిదాసు (85) సోమ వారం మృతి చెందారు. వ్యవసాయ కార్మిక సంఘం జిల్లా నాయకుడిగా సుదీర్ఘ కాలం సేవలందించిన ఆయన రైతుల సమస్యలపై పోరాటం చేశారని సీపీఎం నాయకులు తెలిపారు. ఆయనకు భార్య ఇరువురు కుమారులు, కుమార్తె ఉన్నారు. ఆయన మృతి పట్ల సీపీఎం నాయకులు సంతాపం తెలిపారు.

# పేదలకు మెరుగైన విద్యే ప్రభుత్వ లక్ష్యం



ప్రోత్సాహకాలు స్వీకరించిన విద్యార్థులతో వైస్ ఎంపీపీ శ్రీనివాసరావు



అంగలూరులో బహుమతులు పొందిన విద్యార్థులు చైతన్యవల్లి, కావ్య



ప్రశంసాపత్రాలు స్వీకరించిన విద్యార్థులతో అతిథులు

పామర్రు(తోట్లవల్లూరు): నిరుపేదలైన వారికి కూడా మెరుగైన విద్యను అందించాలనే లక్ష్యంతో సీఎం జగన్మోహన్‌రెడ్డి విద్యను ప్రోత్సహిస్తున్నారని తోట్లవల్లూరు మండలం జెడ్పీటీసీ సభ్యుడు జొన్నల రామ్మోహన్‌రెడ్డి అన్నారు. తోట్లవల్లూరు మండలం నార్త్ వల్లూరు లోని జెడ్పీ హైస్కూల్‌లో పాఠశాల స్థాయి జగనన్న ఆణిముత్యాల కార్యక్రమం సోమవారం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ ప్రభుత్వం పాఠశాల స్థాయిలో పదో తరగతి విద్యార్థులకు నగదు బహుమతులను ఇవ్వడం ఇదే ప్రథమం అన్నారు. పాఠశాల స్థాయిలో పదో తరగతిలో ఉత్తమ ప్రతిభ కనబర్చిన వీ హన్సికకు రూ.3 వేలు, షేక్ నబీలాకు రూ.2 వేలు, ఎం.వెంకట గిరిధర్‌కు రూ.1,000 వంతున నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. కార్యక్రమంలో ఎంపీపీ రాజామణి, పాఠశాల హెచ్‌ఎం ఫణిరాజమోహన్, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**పామర్రులో..**

స్థానిక జెడ్పీ హైస్కూల్ ఆవరణలో పాఠశాల స్థాయి విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలను సన్మానించారు. సీహెచ్ అమూల్యకు రూ.3 వేలు, సుబ్రమణ్యాచారికి రూ.2 వేలు, దాసరి రుక్మిణమ్మకు రూ.వేయి వంతున నగదు ప్రోత్సాహకంగా అందజేశారు. ఈ కార్యక్రమంలో వైస్ ఎంపీపీ ఆరేపల్లి శ్రీనివాసరావు, ఎంపీటీసీ తాడిశెట్టి శ్రీనివాసరావు, ఎస్‌ఎంసీ చైర్మన్ ఎస్.రజని, స్టాఫ్ సెక్రటరీ ఆర్ లక్ష్మీ కుమారి, పాఠశాల ఇన్‌ఛార్జి రాజేశ్వరీ పాల్గొన్నారు.

**కార్పొరేట్‌కు దీటుగా 'ఆణిముత్యాలు'**

గుడ్లవల్లేరు: కార్పొరేట్ స్కూళ్లకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో చదివే టెన్త్ విద్యార్థులు తమ ప్రతిభను చాటుకుని జగనన్న ఆణిముత్యాలుగా నిలిచారని అంగలూరు సర్పంచి మేడేపల్లి రవికుమార్ అన్నారు. అంగలూరు బాలికోన్నత పాఠశాలలో పదో తరగతిలో ఉత్తమ ఫలితాలు సాధించిన విద్యార్థులకు సోమవారం పతకాలను అందించారు. ప్రథమ స్థానం పొందిన సీహెచ్.చైతన్యవల్లికి బంగారు పతకం, ప్రశంసా పత్రం, రూ.3 వేల నగదు బహుమతిని అందజేశారు. ద్వితీయ స్థానం పొందిన ఐ.కావ్యకు సిల్వర్ పతకం, ప్రశంసా పత్రం, రూ.2 వేల నగదు బహుమతిని అందించారు. తృతీయ స్థానం పొందిన ఎం.మేఘనకు కాంస్య పతకం, ప్రశంసా పత్రం, రూ.వెయ్యి నగదు బహుమతిని అందజేశారు. కార్యక్రమంలో పీఏసీఎస్ అధ్యక్షుడు దుగ్గిరాల శేషుబాబు, ఉప సర్పంచి త్రిపురనేని సురేష్, ఇన్‌చార్జి హెచ్‌ఎమ్ బి.త్రిపుర సుందరీదేవి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**కౌతవరంలో..**

కౌతవరం జెడ్పీ హైస్కూల్లో జగనన్న ఆణిముత్యాలుగా ప్రథమ స్థానం పొందిన పి.సిరికుమారికి బంగారు పతకం, ప్రశంసా పత్రం, రూ.3 వేల నగదు బహుమతిని అందజేశారు. ద్వితీయ స్థానం పొందిన సీహెచ్.స్వరూపాకు సిల్వర్ పతకం, ప్రశంసా పత్రం రూ.2 వేల నగదు బహుమతిని అందించారు. తృతీయ స్థానం పొందిన కాలిక్‌కు కాంస్య పతకం, ప్రశంసా పత్రం, రూ.వెయ్యి నగదు బహుమతిని ఎంపీటీసీ ఈడె లక్ష్మి చేతుల మీదుగా అందజేశారు. కార్యక్రమంలో హెచ్‌ఎమ్ బి.పద్మావతి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

**విద్యాభివృద్ధికి జగనన్న కృషి**

ముదినేపల్లి రూరల్ : ప్రభుత్వ పాఠశాలల విద్యాభివృద్ధికి ముఖ్యమంత్రి జగనన్న విశేష కృషి చేస్తున్నారని ఎంపీపీ రామిశెట్టి సత్యనారాయణ అన్నారు. మండలంలోని ముదినేపల్లి, గురజ, బొమ్మినంపాడు, అల్లూరు జెడ్పీహైస్కూల్ విద్యార్థులకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమంలో భాగంగా ఆయా పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులకు సోమవారం బహుమతులు, ప్రశంసా పత్రాలు అందజేశారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ పేద విద్యార్థులకు ప్రభుత్వ పాఠశాలలు ఎంతగానో ఉపయోగ పడుతున్నాయన్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో ప్రతిభ చూపిన విద్యార్థులను ప్రోత్సహించేందుకు జగనన్న ఆణిముత్యాలు కార్యక్రమాన్ని ప్రవేశపెట్టి విద్యార్థులకు ప్రోత్సాహకంగా నగదు బహుమతులు, పతకాలు, ప్రశంసాపత్రాలు అందజేస్తున్నట్లు చెప్పారు. వైస్ ఎంపీపీ రాచూరి రాధా, ముదినేపల్లి సర్పంచ్ నిమ్మగడ్డ కైకమ్మ, ఎంపీటీసీ సభ్యుడు జంపాన కోటయ్య, దాసరి అరుణకుమారి, వైఎస్సార్ సీపీ నేతలు ఈడే వెంకటేశ్వరరావు, దాసరి చిరంజీవి, దివి సతీష్, పేతు రాజా, ఎంఈఓ డి.రామారావు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, స్కూల్ మేనేజ్‌మెంట్ సభ్యులు, స్థానిక నేతలు పాల్గొన్నారు.

గుడివాడ టౌన్(నందివాడ): నందివాడ మండలంలోని వెన్ననపూడి, రుద్రపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో 10వ తరగతి ఉత్తమ మార్కులు సాధించిన విద్యార్థులను సోమవారం సత్కరించారు. నందివాడ ఎంపీపీ పెయ్యల ఆదాం వెన్ననపూడి హైస్కూల్‌లో ఆణిముత్యాలను సత్కరించగా రుద్రపాక జిల్లా పరిషత్ హైస్కూల్‌లో గ్రామ ప్రముఖుడు పిన్నమనేని వీరయ్య చౌదరి సత్కరించారు. వెన్ననపూడి పాఠశాలకు సంబంధించి పి.సత్యకృష్ణ ప్రథమ, జి.అక్షయ్ ద్వితీయ, సీహెచ్ టీఎస్‌డీఎస్ ప్రమీల తృతీయ బహుమతి సాధించారు. రుద్రపాక పాఠశాలలో ఎస్.భవాని ప్రథమ, ఎల్ లక్ష్మీప్రసన్న ద్వితీయ, సీహెచ్ సుజానా తృతీయ బహుమతులు సాధించారు. ఈ కార్యక్రమంలో వెన్ననపూడి, రుద్రపాక ప్రధానోపాధ్యాయులు సుబ్రహ్మణ్యం, సీహెచ్ సుబ్బారావు, వైఎస్సార్ సీపీ నాయకులు నాగరాజు, ఇతర ఉపాధ్యాయులు, విద్యార్థులు తదితరులు పాల్గొన్నారు.



విద్యార్థులను సత్కరిస్తున్న ఎంపీపీ పెయ్యల ఆదాం తదితరులు



విద్యార్థులకు ప్రశంసాపత్రాలు అందిస్తున్న ఎంపీపీ రామిశెట్టి, నాయకులు

కాజ(మొవ్వ): 2022-23 విద్యా సంవత్సరంలో పదోతరగతి పబ్లిక్ పరీక్షల్లో ఉత్తమ ప్రతిభ కనపరిచిన ముగ్గురు విద్యార్థులను ఆణిముత్యాలుగా గుర్తించి ఘనంగా ఆయా ప్రభుత్వ పాఠశాలల్లో సత్కరించారు. గోల్డ్, సిల్వర్, బ్రాంజ్ పతకాలను అందించారు. ప్రోత్సాహక నగదు బహుమతులను, ప్రసంశాపత్రాలను అందజేశారు. మండలంలోని కాజ గ్రామంలో పీఎస్ఆర్ జెడ్పీ పాఠశాలలో తొలి మూడు స్థానాలు సాధించిన షేక్ మస్తాన్‌అలీ, పేటేటి సందీప్, గోళ్ల సతీష్‌లను ఘనంగా సత్కరించి ఆవార్డులను అంజేశారు. ఉప సర్పంచ్ మందా శ్రీనివాసరెడ్డి, హెచ్‌ఎం బండి రమాదేవి, పేకేటి సీతారామరెడ్డి తదితరులు పాల్గొన్నారు.

## సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం

గుడివాడ టౌన్: రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహన్‌రెడ్డి చిత్రపటానికి వైఎస్సార్ సీపీ పట్టణ విభాగం ఎస్సీ సెల్ ఆధ్వర్యంలో సోమవారం క్షీరాభిషేకం చేశారు. ఈ సందర్భంగా ఎస్సీ సెల్ పట్టణ అధ్యక్షుడు రేమల్లి నీలాకాంత్ (పసి) మాట్లాడుతూ గత 30 సంవత్సరాలుగా పట్టణానికి చెందిన ఎస్సీ, ఎస్టీ సామాజిక వర్గ ప్రజలు శ్మశానవాటిక స్థలం లేక నానా ఇబ్బందులు పడుతున్న నేపథ్యంలో ఎమ్మెల్యే కొడాలి శ్రీవెంకటేశ్వరరావు (నాని) విజ్ఞప్తి మేరకు రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ఐదు ఎకరాల భూమి కొనుగోలుకు నిధులు మంజూరు చేయడం అభినందనీయం అన్నారు. వారికి ఎస్సీలు రుణపడి ఉంటారని, ఎమ్మెల్యే కొడాలి నాని, సీఎం జగన్ మోహన్‌రెడ్డికి అండగా ఉంటామన్నారు. ఈ కార్యక్రమంలో ఎస్సీ, మైనార్టీ సెల్ నాయకులు వెంపటి సైమన్, మామిళ్ల ఎలీషా, విక్టర్‌పాల్, విలియం జోషి, బూసి ప్రకాష్, మెండా రవి, జాలాది ప్రభాకర్, పసలాది ఏసుబాబు, శ్యామ్ పాల్గొన్నారు.



సీఎం చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న నాయకులు

## బీఎల్ఓలు బాధ్యతగా పనిచేయాలి

**ఆర్డీఓ పద్మావతి**

గుడివాడ టౌన్: అతి త్వరలో ఎన్నికలు రానున్న సమయంలో బూత్ లెవల్ ఆఫీసర్లు (బీఎల్ఓ) బాధ్యతగా వ్యవహరించాలని ఆర్డీఓ పి. పద్మావతి అన్నారు. స్థానిక మున్సిపల్ కౌన్సిల్ సమావేశం హాలులో సోమవారం బీఎల్ఓకు అవగాహన సదస్సు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ 18 ఏళ్లు నిండిన ప్రతి ఒక్కరినీ ఓటర్లుగా చేర్చాలన్నారు. ప్రస్తుతం ఉన్న ఓటర్ల జాబితాలో మార్పులకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలన్నారు. ఓటరు ఇచ్చిన ఆధారాలతో పాటు కార్యాలయాల్లో ఉన్న ఆధారాలను పోల్చి చూసి మార్పులు చేయాలన్నారు. కొత్త ఓటర్ల నమోదు, ఓటర్ల బదిలీ, ఆధార్‌తో అనుసంధాన విషయంలో బాధ్యతగా వ్యవహరించాలన్నారు. లేని పక్షంలో ఓటరు తన ఓటుహక్కును కోల్పోతారన్నారు. ప్రతి ఒక్కరూ తమకు అప్పగించిన పనులు వేగవంతంగా పూర్తిచేయాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ, తహసీల్దార్ కె.ఆంజనేయులు, ఎలక్షన్ డీటీ లోకరాజు, అసిస్టెంట్ కమిషనర్ రంగారావు, బీఎల్ఓలు పాల్గొన్నారు.



సమావేశంలో మాట్లాడుతున్న ఆర్డీఓ పద్మావతి

## చిన్నారులను అంగన్‌వాడీల్లో చేర్చండి



పెదమద్దాలి ర్యాలీలో సీడీపీవో భానుశ్రీ



పమిడిముక్కలలో అవగాహన ర్యాలీ



ర్యాలీలో సీడీపీవో విజయఫ్లోరెన్స్, అంగన్‌వాడీలు, పిల్లలు

**సీడీపీవోలు**

పెదమద్దాలి(పామర్రు): సీఎం జగన్‌మోహన్‌రెడ్డి ప్రభుత్వం అంగన్‌వాడీ కేంద్రాలను బలోపేతం చేస్తోందని, వీటిని సద్వినియోగం చేసుకోవాలని ఐసీడీఎస్ పామర్రు ప్రాజెక్టు సీడీపీవో వి.భానుశ్రీ అన్నారు. మండలంలోని పెదమద్దాలి గ్రామంలో 6 అంగన్‌వాడీ కేంద్రాల పరిధిలో 'అంగన్‌వాడీ పిలుస్తుంది' కార్యక్రమం సోమవారం నిర్వహించారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా సీడీపీవో మాట్లాడుతూ అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారులకు అన్ని రకాల ఆట సామగ్రి, చదువుకు సంబంధించిన పుస్తకాలు, పౌష్టికాహారం అందిస్తున్నామని తెలిపారు. మూడేళ్లు వచ్చిన ప్రతి చిన్నారినీ అంగన్‌వాడీ కేంద్రంలో చేర్పించాలన్నారు. పెదమద్దాలి సెక్టార్ సూపర్‌వైజర్ ఎస్.వి జయకుమారి, గ్రామ సర్పంచ్ బందెల శాంతకుమారి, హెల్త్ ఆఫీసర్ ఉదయ్‌కిరణ్, అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు చిన్నారులు పాల్గొన్నారు. పామర్రులోని యలమర్రు రోడ్డులోని అంగన్‌వాడీ కేంద్రంలో 'అంగన్‌వాడీపిలుస్తుంది' గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాలను నిర్వహించారు. పామర్రు సెక్టారు సూపర్‌వైజర్ వాణి తెలిపారు. ఈ కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు, ఆయాలు, తల్లులు, చిన్నారులు పాల్గొన్నారు.

పమిడిముక్కల: అంగన్‌వాడీ కేంద్రాలను సద్వినియోగం చేసుకొని లబ్ధి పొందాలని పలువురు వక్తలు పేర్కొన్నారు. పమిడిముక్కల అంగన్‌వాడీ కేంద్రంలో సోమవారం 'అంగన్‌వాడీ పిలుస్తుంది' అవగాహన కార్యక్రమం, అనంతరం చిన్నారులతో ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భం సూపర్‌వైజర్ ఉషారాణి మాట్లాడుతూ మూడు ఏళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల్లో చేర్పించాలన్నారు. ఐదేళ్లు నిండిన చిన్నారులను అంగన్‌వాడీ కేంద్రాల నుంచి ప్రాథమిక పాఠశాలల్లో చేర్పిస్తామన్నారు. కార్యక్రమంలో సర్పంచ్ ముళ్లపూడి సునీత, ఎంపీటీసీ గుర్విందపల్లి వంశీ, అంగన్‌వాడీ కార్యకర్తలు రమణ, సుభాషిణి, ఆయాలు, తల్లులు పాల్గొన్నారు.

గుడివాడరూరల్: పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీలకు పంపించాలని సీడీపీవో విజయఫ్లోరెన్స్ అన్నారు. పట్టణ పరిధిలోని నైజాంపేటలో 2,3 అంగన్‌వాడీ కేంద్రాల్లో గ్రాడ్యుయేషన్ డే కార్యక్రమాన్ని సోమవారం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథి సీడీపీవో మాట్లాడుతూ ప్రభుత్వం అంగన్‌వాడీల్లో పిల్లలు, తల్లులు, గర్భిణులకు పౌష్టికాహారాన్ని సమతుల్యంగా అందిస్తుందన్నారు. అంగన్‌వాడీల్లోనే కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా ఎల్‌కేజీ, యుకేజీలను ఏర్పాటు చేశారన్నారు. పౌష్టికాహారంతో పాటు విద్యను సైతం సమానంగా అందిస్తుందన్నారు. ఈ అవకాశాన్ని అందరూ వినియోగించుకోవాలన్నారు. మూడేళ్లు నిండిన పిల్లలను తప్పనిసరిగా అంగన్‌వాడీ కేంద్రాలకు పంపించాలని కోరారు. అనంతరం తల్లులు, చిన్నారులతో ఐసీడీఎస్ సీడీపీవో, సిబ్బంది ర్యాలీ నిర్వహించారు. సూపర్‌వైజర్ భవానీ, ఏఎన్ఎంలు, ఆశావర్కర్లు, అంగన్‌వాడీ కార్యకర్తలు, సిబ్బంది పాల్గొన్నారు.

## వైఎస్సార్ బీమా సాయం అందజేత

గుడ్లవల్లేరు: పేదల సంక్షేమమే ధ్యేయంగా ఆపదలో సైతం వారి వెన్నంటే సీఎం వై.ఎస్.జగన్‌మోహన్ రెడ్డి ప్రభుత్వం ఉంటుందని వ్యవసాయ సలహా కమిటీ జిల్లా డైరెక్టర్ పెన్నేరు ప్రభాకరరావు అన్నారు. వడ్లమన్నాడు గ్రామస్తురాలు పెన్నేరు సుభాషిణి ఆదివారం మృతి చెందారు. సోమవారం దహన సంస్కారాల ఖర్చుల తక్షణ సాయం కింద రూ.10 వేలను మృతురాలి కుమారుడు పెన్నేరు పవన్‌కు అందజేశారు. ఆ బాధిత కుటుంబానికి రూ.లక్ష వైఎస్సార్ బీమా మంజూరైనట్లు ప్రభాకరరావు తెలిపారు. కార్యక్రమంలో సచివాలయ సంక్షేమ కార్యదర్శి ప్రియాంక, వలంటీర్ వీర్ల జ్యోతి, సిబ్బంది పాల్గొన్నారు.

గుడివాడ టౌన్: స్థానిక 16వ వార్డు గుడ్‌మెన్ పేటకు చెందిన వార్డు సచివాలయం-2లో సోమవారం వైఎస్సార్ బీమా నగదు అందజేశారు. వార్డుకు చెందిన షేక్ ఫిరోజ్ ఇటీవల విద్యుత్ షాక్‌కు గురై మృతి చెందాడు. దీంతో ప్రభుత్వం బీమా రూ.5 లక్షలు అమోదపత్రాన్ని అందజేశారు. ఈ సందర్భంగా వార్డు కౌన్సిలర్ మాదాసు వెంకట లక్ష్మీకుమారి మాట్లాడుతూ రాష్ట్ర ముఖ్యమంత్రి వైఎస్ జగన్ మోహనరెడ్డి ప్రతి పేదవాడి కన్నీళ్లు తుడిచేందుకు అనేక సంక్షేమ కార్యక్రమాలు చేపడుతున్నారని పేర్కొన్నారు. వైఎస్సార్ బీమా ఆ కుటుంబానికి ఎంతో ఆదరణగా ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో వార్డు కన్వీనర్ నాగసింహాచలం, సచివాలయ ఉద్యోగులు విజయ్, కృష్ణ, భాగ్యలక్ష్మి, వలంటీర్ దీపక్, తదితరులు పాల్గొన్నారు.

## చెరువు ఆక్రమణదారులను ఖాళీ చేయించాలి

**కలెక్టర్‌కు సామాజిక కార్యకర్త శ్రీనివాసగౌడ్ వినతి**

పమిడిముక్కల: మండలంలోని గోపువానిపాలెం గ్రామంలోని వల్లభుడి చెరువు, పట్టాభిరాముడు చెరువులలోని ఆక్రమణదారులను ఖాళీ చేయించి 14 ఎకరాల 32 సెంట్లను స్వాధీనం చేసుకోవాలని సామాజిక కార్యకర్త జంపాన శ్రీనివాసగౌడ్ స్పందనలో జిల్లా కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేసి సమస్యను వివరించారు. ఆక్రమణదారులపై క్రిమినల్ చర్యలు తీసుకోవాలని కోరారు. 9.88 ఎకరాల వల్లభుడి చెరువు, 4.44 ఎకరాల పట్టాభిరాముడు చెరువులను స్వాధీనపరచుకొని, ఆ సర్వే నంబర్లలోని భూముల్లో రిజిస్ట్రేషన్లు జరగకుండా చర్యలు తీసుకోవాలని విజ్ఞప్తి చేశారు.



కలెక్టర్ రాజాబాబుకు వినతిపత్రం అందజేసి సమస్యను వివరిస్తున్న శ్రీనివాసగౌడ్

## సమస్యల పరిష్కారానికే స్పందన



స్పందన కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ మురళీకృష్ణ

గుడివాడ టౌన్: ప్రజల సమస్యలు తెలుసుకుని తక్షణమే పరిష్కరించేందుకు స్పందన కార్యక్రమం నిర్వహిస్తున్నామని మున్సిపల్ కమిషనర్ వి.మురళీకృష్ణ అన్నారు. సోమవారం స్థానిక మున్సిపల్ కార్యాలయంలో జరిగిన స్పందన కార్యక్రమానికి మూడు దరఖాస్తులు వచ్చినట్లు ఆయన వివరించారు. స్థానిక 25వ వార్డుకు చెందిన ఎస్ జగదీష్ తమ ప్రాంతంలో రోడ్డు నిర్మించాలని, 7వ వార్డుకు చెందిన ఎస్.ప్రభాకరరావు మూసివేసిన తన స్క్రాబ్ షాప్ తిరిగి ప్రారంభించేందుకు అనుమతి ఇవ్వాలని, 24వ వార్డుకు చెందిన ఎమ్.మజిదీప్ స్థానిక కొత్త మున్సిపల్ కార్యాలయం ఎదుట నూతనంగా ప్రారంభించిన టీ స్టాల్ వలన ట్రాఫిక్ సమస్యలు ఏర్పడుతున్నాయని ఫిర్యాదు చేశారు. స్థానిక ఆర్డీఓ కార్యాలయంలో జరిగిన స్పందనలో పెదపారుపూడి మండలం నాగాపురం గ్రామానికి చెందిన వ్యక్తి గ్రామంలో సర్పంచ్ అనుమతులు లేకుండా మట్టి తరలిస్తున్నారని దానిపై చర్యలు తీసుకోవలసిందిగా కోరారు.

## ఐఐటీ అడ్వాన్స్‌డ్‌లో విద్యార్థుల ప్రతిభ

గుడివాడ టౌన్: ఐఐటీ అడ్వాన్స్‌డ్-2023 ఫలితాల్లో తమ పూర్వ విద్యార్థులు అఖండ విజయం సాధించారని విశ్వభారతి విద్యాసంస్థల చైర్మన్ పొట్లూరి శ్రీమన్నారాయణ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈనెల 18న విడుదలైన ఫలితాల్లో ఓబీసీ కేటగిరిలో దాసరి సాకేత్‌నాయుడు ఆల్ ఇండియా మొదటి స్థానం, నీట్ ఫలితాల్లో ఆల్ ఇండియా కేటగిరిలో ఎస్.సౌమ్య శ్రీ శృతి 57వ ర్యాంక్ సాధించినట్లు ఆయన తెలిపారు. విద్యార్థులను, తల్లిదండ్రులను శ్రీమన్నారాయణ అభినందించారు.



సాకేత్‌నాయుడు



సౌమ్య శ్రీ శృతి

### నేడు 'డయల్ యువర్ ఆర్టీసీ డీఎం'

గుడివాడ టౌన్: ఆర్టీసీ ప్రయాణికులు తమ సమస్యలు తెలుపుతూ ఆర్టీసీ అభివృద్ధికి సలహాలు, సూచనలు ఇచ్చేందుకు 'డయల్ యువర్ ఆర్టీసీ డిపో మేనేజర్' కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. మంగళవారం ఉదయం 11.30 గంటల నుంచి 12.30 గంటల వరకు ఈ కార్యక్రమం కొనసాగుతుందన్నారు. ప్రయాణికుల సురక్షిత, సౌకర్యాలు, రవాణ తదితర అంశాలపై సూచనలు, సలహాలు ఇవ్వాలని కోరారు. ఇందుకు 99592 25464 నంబరుకు ఫోన్ చేయాలని కోరారు.

### రేపు కానుకల లెక్కింపు

ముదినేపల్లి రూరల్ : ప్రసిద్ధి చెందిన సింగరాయపాలెం-చేవూరుపాలెం సెంటర్లోని సుబ్రహ్మణ్యేశ్వరస్వామి ఆలయ హుండీల్లో భక్తులు సమర్పించిన కానుకలు 21న లెక్కిస్తామని ఆలయ చైర్మన్ కొంతి నాగరాజు, సహాయ కమిషనర్ నేల సంధ్య సోమవారం తెలిపారు. గుడివాడ డివిజన్ ఎండోమెంట్ ఇన్‌స్పెక్టర్ ఆధ్వర్యంలో నిర్వహించే ఈ లెక్కింపు కార్యక్రమంలో వివిధ ఆలయాలకు చెందిన మేనేజర్లు, సిబ్బంది పాల్గొంటారన్నారు. ఆసక్తి ఉన్న స్థానిక ప్రముఖులు లెక్కింపు కార్యక్రమంలో పాల్గొనవచ్చన్నారు.

### విద్యార్థులకు ఉచిత బస్సు పాస్‌లు

గుడివాడ టౌన్: పాఠశాలలు తిరిగి ప్రారంభించిన సందర్భంగా 12 ఏళ్లలోపు బాలురకు, 18 ఏళ్ల లోపు బాలికలకు ఉచిత బస్ పాస్‌లు అందజేస్తున్నట్లు డిపో మేనేజర్ జి.రాజేష్‌కుమార్ సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. పాఠశాల నుంచి 20 కిలో మీటర్ల పరిధిలో ఈ పాస్‌లు వినియోగించుకోవచ్చన్నారు. విద్యార్థులు ఈ అవకాశాన్ని వినియోగించుకోవాలని కోరారు.

### వైఎస్సార్ పశుబీమా పథకంపై అవగాహన



మాట్లాడుతున్న పశుసంవర్ధక శాఖ ఏలూరు ఏడీఏ రామచంద్రరావు

మండవల్లి: మండవల్లి పశువైద్యశాలలో వైఎస్సార్ పశుబీమా పథకంపై సోమవారం అవగాహన సదస్సు నిర్వహించారు. ఏలూరు ఉప సంచాలకులు ఎ.రామచంద్రరావు పశుపోషణపై ఆధారపడిన పశుపోషకులకు ఆపత్కాలంలో పశుబీమా చెల్లించి రైతులు ధీమాగా ఉండటానికి ఏపీ ప్రభుత్వం ఈ పథకం ప్రారంభించినట్లు తెలిపారు. ఒకసారి ఈనిన గేదె, ఆవు జాతి పశువులకు ఒక్కింటికి రూ.30 వేలు, నాటు జాతి పశువులకు రూ.15 వేలు చొప్పున బీమా చెల్లించుకోవచ్చన్నారు. తెల్లరేషన్ కార్డుదారులకు, ఎస్సీ, ఎస్టీవారికి 80 శాతం సబ్సిడీతో ప్రీమియం చెల్లించాలని, మిగతా వారు ఏపీఎల్ 50 శాతం సబ్సిడీపై ప్రీమియం చెల్లించాలని తెలియజేశారు. ఎద్దులు, దున్నలకు, ఆరు నెలలు పైబడిన గొర్రెలు, మేకలలకు బీమా వర్తిస్తుందన్నారు. మండవల్లి పశువైద్య సహాయ సంచాలకులు డీవీ వరప్రసాద్ మాట్లాడుతూ ఒక తెల్ల రేషన్‌కార్డుదారుడు ఒక సంవత్సరంలో 50 పెద్ద పశువులకు, 50 గొర్రెలు, మేకలకు బీమా చెల్లించుకోవచ్చని తెలిపారు.

### ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు

మండవల్లి: ఎమ్మెల్యే దూలం నాగేశ్వరరావు (డీఎన్నార్) ఆదేశాల మేరకు స్థానిక వెలమపేటలో లోవోల్టేజీ సమస్య నివారణకు సోమవారం కొత్త ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు చేసినట్లు సర్పంచ్ మెండా ఝాన్సి పేర్కొన్నారు. ట్రాన్స్‌ఫార్మర్ ఏర్పాటు ద్వారా మెరుగైన విద్యుత్ సరఫరా అందుబాటులోకి వస్తుందని పేర్కొన్నారు. వైఎస్సార్ సీపీ నాయకులు మెండా సురేష్, విద్యుత్‌శాఖ సిబ్బంది పాల్గొన్నారు.

### జూలై 1న అరుణాచలానికి బసు సర్వీస్

మచిలీపట్నంటౌన్: మచిలీపట్నం బస్టాండ్ నుంచి అరుణాచలానికి జూలై 1వ తేదీన సూపర్ లగ్జరీ బస్సు సర్వీసు బయలుదేరుతుందని డీఎం టి.పెద్దిరాజు సోమవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు బయలుదేరి 2వ తేదీ శ్రీకాళహస్తి, కాణిపాకం, శ్రీపురంలోని దేవాలయాలు దర్శించుకుని, రాత్రి 11 గంటలకు అరుణాచలం చేరుతుందన్నారు. 3వ తేదీన గిరి ప్రదక్షిణలు చేసిన అనంతరం బయలుదేరి 4వ తేదీ ఉదయం మచిలీపట్నం చేరుతుందన్నారు. ఈ అవకాశాన్ని మచిలీపట్నం పరిసర ప్రాంత ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు. వివరాలకు 99592 25462 నంబరును సంప్రదించాలన్నారు.